జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 150 16-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్..

సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం

కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు

తనపై కోపంతో స్థానిక నేతలను వేధించొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి

ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల కొరతపై విమర్శలు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని

2లో

### తుని బాలిక అదృశ్యం ఘటనపై

## పవన్ కల్యాణ్ ఆరా...

### ఆధారం అనుకున్న పెంపుడు కుక్క మృతి

వారం రోజులు గడిచినా ఆచూకీ లభించకపోవడంతో తీవ్రత పెంచాలని ఆదేశం

గాలింపు చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు వినియోగించుకోవాలని సూచన

ఇప్పటికే 400 మంది సిబ్బందితో గాలిస్తున్నట్టు పవన్‌కు వివరించిన ఎస్పీ



అటవీ నిపుణుల సాయంతో పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా జల్లెడ పట్టాలని సలహా కాకినాడ జిల్లా, తుని మండలం సీహెచ్ అగ్రహారంలో వారం రోజుల క్రితం అదృశ్యమైన బాలిక జ్ఞానేశ్వరి ఆచూకీని వీలైనంత వేగంగా



## "అస్సాం గగనతలంలో ఘోర క్రాష్.. నేలకొరిగిన ఐదుగురు దేశ వీర జవానులు!"

జోర్హాట్ రన్‌వేపై మృత్యుఘోష..

ముక్కలైన యుద్ధ విమానం..

హైలెవల్ ఎంక్వైరీకి ఆదేశించిన ఎయిర్ ఫోర్స్

2లో

భారత వైమానిక దళానికి చెందిన ఆంటోనోవ్ ఏఎన్-32 రవాణా విమానం అస్సాంలోని జోర్హాట్ ఎయిర్ బేస్ సమీపంలో ప్రమాదవశాత్తు కూలిపోయింది. ఈ ఘోర ప్రమాదంలో దేశ సేవలో ఉన్న ఐదుగురు ధైర్యవంతులైన వైమానిక దళ సిబ్బంది వీరమరణం పొందారు. ఈ ప్రమాదంలో విమానం యొక్క కో-పైలట్ ఒక్కరు మాత్రమే తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం ఆయనకు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన ఆ ఐదుగురు వీర సైనికుల వివరాలు ఇవే.. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, భారత వైమానిక దళం తక్షణమే స్పందించింది. ఈ ప్రమాదం జరగడానికి గల కారణాలను తెలుసుకోవడానికి ఒక 'కోర్టు ఆఫ్ ఎంక్వైరి' ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

## రాష్ట్రంలో కేటీఆర్‌కే స్థానం లేదు

మా స్థానం గురించి ఏం మాట్లాడతారు?

కాంగ్రెస్ పార్టీకి పోటీయే లేదు.. మళ్లీ మాదే అధికారం

మీడియాతో ఇష్టాగోష్టిలో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

హైదరాబాద్: తెలంగాణలో ఆయనకే స్థానం లేదని, ఇక మా స్థానం గురించి కేటీఆర్ ఏం మాట్లా డతారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. వాళ్లు మూడో స్థానంలో ఉన్నారని, అందుకే మేం మూడో స్థానంలోకి వెళ్తామని

2లో



### అంగన్వాడీల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని మంత్రి సీతక్క వెల్లడి



+ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిన అంగన్వాడీలకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్!
+ వారి స్థానంలో కొత్త నియామకాలు జరగకపోతే తిరిగి విధుల్లోకి అవకాశం
+ వేలాది మంది కార్యకర్తలు, సహాయకులకు లభించిన భరోసా

2లో

### ఆ ఎమ్మెల్యేల కోసం సీఎం విజయ్ 'షాపింగ్' చేస్తున్నారు: స్టాలిన్ ఎద్దేవా



విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం బీజేపీకి జిరాక్స్ కాపీ అని ఎద్దేవా

అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ప్రతిపక్షాన్ని బలహీనపరుస్తున్నారని ఆగ్రహం

టీవీకే కార్యకర్తల నుంచి మహిళలకు రక్షణ కల్పించాలన్న స్టాలిన్

ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం తమకు లేదని స్పష్టీకరణ

2లో

### కూటమి ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు: వైఎస్ షర్మిల



సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అయిందన్న షర్మిల

అప్పులు చేయడంలో ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని ఎద్దేవా

పాలన అంతా మాయాబజార్ లా కనిపిస్తోందని విమర్శ




## బీఆర్ఎస్, బీజేపీ మిలాఖత్

- హరీశ్‌రావు లేఖ రాస్తే కిషన్‌రెడ్డి స్పందిస్తున్నారు: డిప్యూటీ సీఎం భట్టి
- సింగరేణికి నష్టం చేసింది బీఆర్ఎస్ సర్కారే
- ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల కోసంసంస్థ రూ.వేల కోట్లు కోల్పోయింది
- బాసర టు భద్రాచలం దాకా ఆధ్యాత్మిక కారిడార్

2లో

మంచిర్యాల: గత బీఆర్ఎస్ నాయకత్వం, బీజేపీ కలిసి సింగరేణికి నష్టం చేసి, ఇప్పుడు ఇద్దరూ మిలాఖత్ అయి దొంగే దొంగ అన్నట్టుగా నాటకాలు ఆడుతున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. దోపిడీదారులు, కుట్రలు చేసే వారి నుంచి సింగరేణి ఆస్తులు, వనరులను కాపాడతామని చెప్పారు. శనివారం మంచిర్యాల జిల్లాలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలసి ఆయన దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి, మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయాల అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అంతకుముందు 335 మందికి సింగరేణి కారుణ్య నియామక పత్రాలు అందజేసే కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు.

## పెట్టుబడులే లక్ష్యం..



- రేపు సింగపూర్‌కు సీఎం చంద్రబాబు
- సింగపూర్ పర్యటనలో కీలక భేటీలు
- సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం
- అమరావతి నిర్మాణంపై సుర్బానా జురాంగ్ సంస్థతో చర్చలు
- 2026 సీఐఐ భాగస్వామ్య సదస్సు రోడ్‌షోలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

ఏపీకి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సింగపూర్‌లో పర్యటించనున్నారు. జూన్ 14 నుంచి సాగే ఈ పర్యటనలో రాష్ట్రానికి, ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు సమీకరించడంపై ఆయన ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇందుకోసం రేపు ఉదయం బెంగళూరు నుంచి ఆయన సింగపూర్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

2లో

## కూటమి ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు: వైఎస్ షర్మిల




ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో... ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన 'సూపర్ సిక్స్' వాగ్దానాలు రెండేళ్ల పాలనలో పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అయ్యాయని ఆమె దుయ్యబట్టారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని, కేవలం అప్పులు చేయడంలోనే ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని షర్మిల ఎద్దేవా చేశారు. 'పబ్లిసిటీ పీక్.. పాలన వీక్', 'అప్పులు ఫుల్.. అభివృద్ధి నిల్' అని విమర్శించారు. ప్రస్తుత పరిపాలన అంతా ఒక 'మాయాబజార్'లా కనిపిస్తోందని, ప్రజలను భ్రమల్లో ముంచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తామన్న హామీ ఎటు పోయిందని నిలదీశారు. బుట్టెడు ఆశలు చూపి ప్రజల నుంచి ఓట్లు దండుకున్న ఎన్డీయే నేతలు, అధికారంలోకి వచ్చాక కేవలం గుప్పెడు హామీలను కూడా సరిగ్గా అమలు చేయలేకపోయారని ఆరోపించారు. ప్రజలను దారుణంగా వంచించిన ఈ ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

## ఆ ఎమ్మెల్యేల కోసం సీఎం విజయ్ 'షాపింగ్' చేస్తున్నారు: స్టాలిన్ ఎద్దేవా

తమిళనాడులో అధికారంలో ఉన్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం, ముఖ్యమంత్రి విజయ్ తీరుపై డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. టీవీకే సర్కార్ బీజేపీకి 'జిరాక్స్ కాపీ'లా మారిందని, అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కొనుగోలు చేస్తూ ప్రతిపక్షాన్ని బలహీనపరిచే కుట్రకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.శనివారం చెన్నైలోని అన్నా అరివాలయంలో జరిగిన డీఎంకే మహిళా విభాగం సమావేశంలో స్టాలిన్ ప్రసంగించారు. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక వ్యూహాలనే తమిళనాడులో టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి విజయ్ అన్నాడీఎంకే ఎమ్మెల్యేల కోసం 'షాపింగ్' చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికలు ముగిసి 21 రోజులు కూడా గడవకముందే, వేలికి ఉన్న సిరా గుర్తు చెరగకముందే నలుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరారని, వారికి ఎలాంటి ఆఫర్ ఇచ్చి చేర్చుకున్నారని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో మహిళల భద్రత అంశాన్ని ప్రస్తావిస్తూ, శ్రీవైకుంఠంలో జరిగిన ఒక లైంగిక వేధింపుల ఘటనను స్టాలిన్ ఉదహరించారు. ఈ కేసులో బాధితురాలు టీవీకే సభ్యురాలైతే, నిందితులు కూడా అధికార పార్టీకి చెందిన వారని ఆయన ఆరోపించారు. అయితే, నిందితులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, బాధితురాలినే పార్టీ నుంచి తొలగించడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. టీవీకే కార్యకర్తల నుంచి మహిళలకు రక్షణ కల్పించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. గతంలో టీవీకే ప్రభుత్వంపై తాను చేసిన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారని స్టాలిన్ స్పష్టం చేశారు. కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని భావించినప్పటికీ, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు తనను మౌనంగా ఉండనివ్వడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని కూల్చడం తమ ఉద్దేశం కాదని, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా డీఎంకే తన పాత్రను పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో డీఎంకేను తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి మహిళా కార్యకర్తలు అంకితభావంతో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రాష్ట్రంలో కేటీఆర్‌కే స్థానం లేదు

అంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పోటీనే లేదని, మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'కేసీఆర్ బస్సు యాత్ర, కేటీఆర్ పాదయాత్ర చేస్తామంటున్నారు. యాత్రలు చేయడంలో తప్పులేదు.వైఎస్సార్ పాదయాత్ర, రాహుల్‌గాంధీ భార త్ జోడో యాత్రలు దేశ చరిత్రను మలుపు తిప్పా యి. కానీ వీళ్లు ఏమని యాత్రలు చేస్తారు? యాత్ర లో ప్రజలకు ఏం చెప్తారు? అయినా వీళ్లు యాత్రలు చేస్తే ఆదరించేవారు ఎవరు? అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో చేసిన ఆర్థిక విధ్వంసం, భూదోపిడీ, అస్తవ్యస్త పాలన, రైతుల ఆత్మహత్యలపై ప్రజలకు వివరణ ఇచ్చి వీళ్లు యాత్రలు చేయాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏదైనా మాట్లాడొచ్చు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ, బీజేపీ ఫాసిస్టు విధా నాలపై కేటీఆర్ స్పందించాలి'అని పేర్కొన్నారు. రూ.వేల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్‌రెడ్డి అంటున్నారు. ఆయనే కేంద్ర బొగ్గు మంత్రి కదా? ఏం కుంభకోణం జరిగిందో విచారణ చేసి దోషులెవరో తేల్చవచ్చు కదా. ఈసారి బీజేపీకి ఉన్న 8 మంది ఎంపీలు ఓడిపోతారు. అసలు వీళ్లు రాష్ట్రానికి ఏం చేశారని మళ్లీ గెలుస్తారు? బీజేపీ అనే దుష్టసంహారం కోసమే కాంగ్రెస్ పార్టీలో విలీనం అయ్యేందుకు జాతీయ స్థాయిలో పార్టీలు ముందుకొస్తున్నాయి. దేశ ప్రజల హక్కుల రక్షణ కోసం ఏం చేయాలన్నదానిపై ఇటీవల ఏఐసీసీ సమావేశంలో చర్చించారు. ఆ మేరకు ఈ నెల 24 నుంచి దేశవ్యాప్త కార్యాచరణ ఉంటుంది.'అని మహేశ్‌గౌడ్ స్పష్టం చేశారు.

**పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు సరికాదు..**

'రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం సరైంది కాదు. అసలు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి కదా? రాష్ట్రం ఇవ్వాలని అడిగింది, ఇచ్చింది మేమే. అయినా ఏ రోజూ ప్రాంతీయ తత్వాలను ఉసిగొల్పి అమాయక విద్యార్థుల జీవితాలతో ఆడుకోలేదు. పీసీసీ అధ్యక్షుడిగా ఎలా ఉండాలో నాకు తెలుసు. 40 ఏళ్లలో నేను నేర్చుకుంది అదే. తప్పు చేయనంతవరకు నేను భయపడేది లేదు. మీనాక్షీ నటరాజన్ విషయంలో బీజేపీ దిగజారి ప్రవర్తించింది. రిటర్నింగ్ అధికారి ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలా వ్యవహరించి ఇలా చేశారు. ఆయన్ను ఉరితీసినా తప్పు లేదు. కాంగ్రెస్ పార్టీ వారే సమాచారం ఇచ్చారని అనడంలో వాస్తవం లేదు. అయినా లీకు వీరులు, గ్రీకు వీరులెవరైనా ఉంటే సీఎం విచారణ జరిపి తేలుస్తారు. మీనాక్షి విషయంలో కోర్టుకు వెళతాం..'అని పీసీసీ చీఫ్ తెలిపారు.

# పెట్టుబడులే లక్ష్యం..

ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పలువురు ఉన్నతాధికారులు కూడా ఈ పర్యటనకు వెళ్లనున్నారు.పర్యటనలో భాగంగా చంద్రబాబు సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో పాటు ఆ దేశ ఉప ప్రధాని, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్, విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్, హోం మంత్రి షణ్ముగమ్ వంటి కీలక నేతలతో సమావేశమవుతారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, ప్రభుత్వ విధానాలను వారికి వివరించనున్నారు. తొలుత సింగపూర్‌లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో భేటీ అయి పర్యటన అజెండాపై చర్చిస్తారు.పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు గూగుల్ క్లౌడ్, జీఐసీ, వైసీహెచ్ లాజిస్టిక్స్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు భేటీ కానున్నారు. స్టార్టప్ వెంచర్ క్యాపిటలిస్టులతో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ అధ్యక్షుడితోనూ సమావేశమై విద్యా రంగంలో భాగస్వామ్యంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో అత్యంత కీలకమైన అంశం రాజధాని అమరావతి. రాజధాని మాస్టర్ ప్లాన్ రూపొందించిన సుర్బానా జురాంగ్ సంస్థ ప్రతినిధులతో అమరావతి ప్రణాళికపై ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.పర్యటనలో భాగంగా 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం 2026లో విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా ఏర్పాటు చేసిన బిజినెస్ రోడ్‌షోలో చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించుకుని 16న రాత్రి 10 గంటలకు ఆయన తిరిగి స్వదేశానికి రానున్నారు. ముఖ్యమంత్రి వెంట పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, సీఆర్డీఏ అధికారుల బృందం కూడా ఈ పర్యటనలో పాల్గొంటుంది.

## బీఆర్ఎస్, బీజేపీ మిలాఖత్

హరీశ్‌రావు పదేళ్లు మంత్రిగా పని చేసి రోజుకో అబద్ధం చెబుతూ అబద్ధాల రావుగా మారారని భట్టి ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రిగా ఉండి కిషన్‌రెడ్డి సింగరేణికి ఏం చేశారని ప్రశ్నించారు. సంస్థపై కుట్రపూరితంగా హరీశ్‌రావు లేఖ రాస్తే, కిషన్‌రెడ్డి స్పందిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల కోసం రెండు బ్లాక్‌లను సంస్థకు రాకుండా చేశారని ఆరోపించారు. కోయగూడెం బ్లాక్ వేలంలో పాల్గొనకపోవడంతో రూ.29,106 కోట్ల విలువైన 67 మిలియన్ టన్నుల బొగ్గును సంస్థ కోల్పోయిందన్నారు. దీంతో సంస్థకు వచ్చే రూ.19,360 కోట్ల లాభం చేజారిపోయిందని మండిపడ్డారు. ఎనిమిదేళ్లు మైనింగ్ చేసే సత్తుపల్లి బ్లాక్ 3లో 32 మిలియన్ టన్నుల బొగ్గు ఉండగా, వేలంలో పాల్గొనక రూ.10,032 కోట్ల నష్టం వాటిల్లిందని, రూ.2,624 కోట్ల నికర లాభాన్ని సింగరేణి నష్టపోయిందన్నారు. సింగరేణి. 'మారుపేర్ల'సమస్యపై ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు.

**గోదారి పుష్కరాలు, ఆలయాలకు రూ.3 వేల కోట్లు**

పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 37 రోజుల్లోనే నిధుల మంజూరు చేసి గూడెం సత్యనారాయణస్వామి ఆలయానికి రూ.70 కోట్లతో పనులు ప్రారంభించామని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి రూ.2,216 కోట్లు మంజూరు చేశామన్నారు. గోదావరి పుష్కరాల కోసం అవసరమైన వసతులు, ఘాట్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మరో రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గోదావరి పరీవాహక ఆలయాల అభివృద్ధికి బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న పుణ్యక్షేత్రాలను రూ.802 కోట్లతో సుందరీకరించి, ఆధ్యాత్మిక కారిడార్‌గా వృద్ధి చేస్తామన్నారు. ఈ పర్యటనలో గూడెం గుట్ట ఆలయ అభివృద్ధికి రూ.70కోట్లు, మినీ ఎత్తిపోతల పథకానికి, మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల ఆఫీసులకు రూ.1.40కోట్లు, విశ్వనాథ ఆలయం అభివృద్ధికి రూ.3 కోట్లతో పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కె.ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్, రాజ్ ఠాకూర్, గండ్ర సత్యనారాయణరావు, రామ్‌దాస్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు.

## తుని బాలిక అదృశ్యం ఘటనపై పవన్ కల్యాణ్ ఆరా...

కనుగొనాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై ఆయన శనివారం కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి, గాలింపు చర్యల పురోగతిని సమీక్షించారు. వారం రోజులు గడుస్తున్నా బాలిక ఆచూకీ లభించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, దర్యాప్తును మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయంపై ఆయన పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు.ప్రస్తుతం పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిర్వహిస్తున్న గాలింపు చర్యలకు అదనంగా మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని పవన్ కల్యాణ్ సూచించారు. ముఖ్యంగా, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) సేవలను కూడా వినియోగించుకోవాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాలిక ఇంటి పరిసరాల్లో దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నందున, ఆ ప్రాంతంలో విస్తృతంగా జల్లెడ పట్టాలని తెలిపారు. అడవుల్లో తిరగడంలో నైపుణ్యం ఉన్న నిపుణులు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నైట్ వాచర్లు, బేస్ క్యాంప్ వాచర్ల సహాయం తీసుకోవడం ద్వారా గాలింపును మరింత ప్రభావవంతంగా మార్చాలని సలహా ఇచ్చారు.ఈ సందర్భంగా, జిల్లా ఎస్పీ చేపడుతున్న చర్యలను డిప్యూటీ సీఎంకు వివరించారు. బాలిక ఆచూకీ కోసం ఇప్పటికే 400 మందికి పైగా సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అత్యాధునిక డ్రోన్ల సహాయంతో అణువణువూ గాలిస్తున్నామని, బాలిక ఇంటి చుట్టుపక్కల ఉన్న 38 సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించామని ఆయన పవన్ కల్యాణ్‌కు తెలియజేశారు. డిప్యూటీ సీఎం ఆదేశాల నేపథ్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేసి, అదనపు బలగాలను సమీకరించి, బాలికను సురక్షితంగా గుర్తించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఉన్నత స్థాయి నుంచి వస్తున్న పర్యవేక్షణతో ఈ కేసు దర్యాప్తులో మరింత వేగం పుంజుకుంది.చిన్నారి జ్ఞానేశ్వరి కేసులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బాలిక ఆచూకీ కనుగొనడంలో పోలీసులకు కీలక ఆధారంగా నిలుస్తుందని భావించిన కుటుంబం పెంపుడు కుక్క మరణించింది. దీంతో ఈ కేసు దర్యాప్తులో పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లయింది.తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో నివసిస్తున్న సుంకర గణేష్, భవానీ దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి జూన్ 6వ తేదీన ఇంటి వద్ద ఆడుకుంటూ అదృశ్యమైన విషయం తెలిసిందే. పాపతో పాటు వారి పెంపుడు కుక్క కూడా కనిపించకుండా పోయింది.

## మనకు ఎల్ ని'నో'!

హిందూ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఒక అరుదైన వాతావరణ పరిస్థితి మనల్ని కాపాడనున్నట్టు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఆ పరిస్థితినే శాస్త్రవేత్తలు 'పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్' (పాజిటివ్ ఐఓడీ) లేదా 'ఇండియన్ నినో'అని పిలుస్తున్నారు. ఏమిటీ పాజిటివ్ ఐఓడీ?: హిందూ మహాసముద్రం తూర్పు, పశ్చిమ భాగాల మధ్య ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పునే 'ఐఓడీ'అంటారు. ఈ పరిస్థితులో పశ్చిమ భాగం (భారత్/ఆఫ్రికా వైపు) సముద్రపు నీరు సాధారణం కంటే బాగా వేడెక్కుతుంది. దీనివల్ల భారీగా తేమతో కూడిన మేఘాలు ఏర్పడతాయి. తూర్పు భాగం (ఇండోనేసియా వైపు)లో నీరు సాధారణం కంటే చల్లబడుతుంది. పసిఫిక్‌లోని ఎల్ నినో మన దేశానికి వచ్చే రుతుపవన గాలులను వెనక్కి లాగేస్తుంటే.. హిందూ మహాసముద్రంలోని 'ఇండియన్ నినో'ఆ గాలులను అంతే బలంగా మన దేశం వైపు నెడుతుంది. ఫలితంగా ఎల్ నినో తెచ్చే పొడి గాలులు తటస్థంగా మారి, దేశంలో సాధారణ వర్షాలు కురుస్తాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. 1997 నాటి వాతావరణ అద్భుతం!: ఇలాంటి పరిస్థితి 1997లోనూ చోటు చేసుకుంది. ఆ ఏడాది.. శతాబ్దంలోనే అత్యంత బలమైన ఎల్ నినో రావడంతో భారత్‌లో తీవ్ర కరువు ఖాయమనే అంచనాలు వెలువడ్డాయి. కానీ సరిగ్గా అదే సమయంలో హిందూ మహాసముద్రంలో ఏర్పడిన బలమైన 'పాజిటివ్ ఐఓడీ'... ఎల్ నినో ప్రభావాన్ని పూర్తిగా తిప్పికొట్టింది. ఆ ఏడాది కరువు రాకపోగా.. దేశంలో సాధారణం కంటే 2 శాతం ఎక్కువే వర్షాలు కురిశాయి. వాస్తవానికి ఎల్ నినో వచ్చిన ప్రతిసారీ దేశంలో కరువు రావాలనేమీ లేదు. అయితే ఈ ఏడాది మనకు 'ఇండియన్ నినో'రక్షణగా నిలవబోతున్నదన్న అంచనాలు, భారతీయ రైతాంగానికి, సాధారణ ప్రజలకు ఇది పెద్ద ఊరట అనే చెప్పాలి.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిన అంగన్వాడీలకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్!

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ పదవులకు రాజీనామా సమర్పించి, ఎన్నికల్లో ఓటమి చెందిన అంగన్వాడీ టీచర్లు, సహాయకులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సదరు పోస్టుల్లో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగని పక్షంలో, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జూన్ 13న అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలనే ఆకాంక్షతో ఉద్యోగాలను సైతం త్యాగం చేసిన అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వ నిర్ణయం పెద్ద ఊరటనిచ్చింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, సదరు స్థానాలు ఖాళీగా ఉన్న పక్షంలో వారిని తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.ఈ నిర్ణయంపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందిస్తూ, అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు అందించడంలో అంగన్వాడీల పాత్ర కీలకమని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆమె స్పష్టం చేశారు.ప్రభుత్వం తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,781 అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తూ, ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలైన వారికి తిరిగి ఉపాధి లభించనుంది. ఇది వారి జీవనోపాధికి భరోసా కల్పించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో అమలవుతున్న పౌష్టికాహార కార్యక్రమాలు నిరంతరాయంగా, సమర్థవంతంగా కొనసాగేందుకు దోహదపడనుంది.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్..

పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రాజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## 'అస్సాం గగనతలంలో ఘోర క్రాష్..

ఈ విచారణలో పరిగణనలోకి తీసుకోనున్న కీలక అంశాలు ఏంటంటే.. విమానంలో సాంకేతిక లోపాలు ఏమైనా తలెత్తాయా?, ఇంజిన్ వైఫల్యం ఏమైనా జరిగిందా, లేదా ప్రమాదం జరిగిన సమయంలో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయి అనేవి కీలకం కానున్నాయి. ప్రమాద సమయంలో కాక్‌పిట్‌లో ఉన్న వారిలో కో-పైలట్ మాత్రమే ప్రాణాలతో బయటపడటంతో, ప్రమాదం జరిగిన తీరును అర్థం చేసుకోవడానికి ఆయన ఇచ్చే వాంగ్మూలం (స్టేట్‌మెంట్) ఈ విచారణలో అత్యంత కీలకం కానుందని చెబుతున్నారు. ఈ ఘటనపై భారత వైమానిక దళం అధికారికంగా స్పందిస్తూ, "ఈ విషాదకర ఘటనలో అమరులైన వీర జవాన్ల కుటుంబాలకు భారత వాయుసేన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది. ఈ కష్టకాలంలో అమరవీరుల కుటుంబాలకు వాయుసేన అండగా నిలుస్తుంది" అని పేర్కొంది. దేశ రక్షణలో అహర్నిశలు శ్రమించే వీర జవాన్ల మరణం దేశాన్ని శోకసంద్రంలో ముంచెత్తింది. వైమానిక దళం చేపట్టిన విచారణలో త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




# రేణికుంటలో వైభవంగా శ్రీవారి మండల పూజలు

- భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకాలు
- విశేషంగా తరలివచ్చిన భక్తులు

**తొలివెలుగు, రాజాపేట:** మండలంలోని రేణికుంట గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 41 రోజుల మండల పూజా మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన బోళ్ల ఇందిర-నర్సిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గత నెలలో రేణికుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగిన విషయం విదితమే. శనివారంతో విగ్రహ ప్రతిష్ఠ జరిగి మండల రోజులు (41 రోజులు) పూర్తి కావడంతో ఆలయంలో విశేష పూజలు చేపట్టారు.



**శాస్త్రోక్తంగా పూజాధికాలు:**

అలయ అర్చకులు రేగొండ పాండురంగం ఆధ్వర్యంలో ఉదయం నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటగా కలశ ఆరాధన, మహాగణపతి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేకంగా పంచామృతాభిషేకం గావించారు. స్వామి వారిని నూతన పట్టు వస్త్రాలు, దివ్య అభరణాలు, సుగంధ పుష్పమాలలతో నయనానందకరంగా అలంకరించారు. ఆ తర్వాత స్వామి వారికి అష్టోత్తర శతనామార్చన, పంచ హారతి, నక్షత్ర హారతి, మహా మంగళహారతి నీరాజన కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. ఈ పూజా మహోత్సవంలో పాల్గొన్న భక్తులు గోవింద నామస్మరణ చేయడంతో ఆలయ ప్రాంగణం హరినామ సంకీర్తనలతో మారుమోగింది. పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా బోళ్ల ఇందిర-నర్సిరెడ్డి కుటుంబ సభ్యుల సౌజన్యంతో విచ్చేసిన భక్తులందరికీ భారీగా అన్నప్రసాద వితరణ (అన్నదానం) చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తరించారు.

# ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా కిషోర్‌కుమార్

- ఏకగ్రీవంగా చౌటుప్పల్ మండల కమిటీ ఎన్నిక
- పలువురు ప్రజాప్రతినిధుల హర్షం.. నూతన కమిటీకి సత్కారం

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామంలో గల రిక్కల సత్తిరెడ్డి గార్డెన్స్‌లో ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుర్కంటి శ్రీధర్ రెడ్డి పర్యవేక్షణలో మండల ఉప సర్పంచుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చౌటుప్పల్ మండల నూతన కమిటీని సర్వసభ్యుల ఆమోదంతో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఫోరం మండల అధ్యక్షుడిగా చింతలగూడెం ఉపసర్పంచ్ బొమ్మకంటి కిషోర్ కుమార్ ఎన్నికయ్యారు.

**నూతన కార్యవర్గం వివరాలు:**

కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మీసాల నరసింహ, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా కందగట్ల సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బోయ సదానందం, కోశాధికారిగా వలందాసు మహేష్ గౌడ్ ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా జెల్ల పవన్ కుమార్, బాతరాజు ధనుంజయ్, పల్చం జయమ్మ, కార్యదర్శిగా శ్యామల చిరంజీవి, సహాయ కార్యదర్శులుగా నిమ్మల సత్యనారాయణ, ముద్దం రమేష్ యాదవ్ నియుక్తులయ్యారు. గౌరవ సలహాదారులుగా పినింటి శ్రీనివాసరెడ్డి, ఉప్పునూతల నరసింహ, సుర్కంటి ప్రభాకర్ రెడ్డి, ఫకీరు శ్రీనివాస్ రెడ్డి ఎన్నికవగా.. కమిటీ సభ్యులుగా బోయిని లింగస్వామి యాదవ్, గడ్డం సత్తయ్య, పెరుమాండ్ల లింగస్వామి, బకనగారి శ్రవణ్ కుమార్, సామిడి శ్రీనివాస్ రెడ్డి, సుర్కంటి అనూప్ రెడ్డి, డి. రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**హక్కుల పరిరక్షణే ధ్యేయం:**

నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బొమ్మకంటి కిషోర్ కుమార్‌కు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలోని ఉప సర్పంచులందరినీ ఏకతాటిపైకి తెచ్చి, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉప సర్పంచుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడతానని, తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మండల ఉప సర్పంచులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.



# కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సహదేవ్‌గౌడ్‌కు సన్మానం

- హాజరైన ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డా. చీమ శ్రీనివాస్
- ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

తొలివెలుగు, వలిగొండ: వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన బత్తిని సహదేవ్ గౌడ్‌ను శనివారం ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన వలిగొండలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన అధ్యక్షుడికి పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

**మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి:**

ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రత్యేక సబ్ కమిటీని వేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల ఫోరం నాయకుడైన బత్తిని సహదేవ్ గౌడ్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమించడం సంతోష దాయకమన్నారు.



**హామీలను నెరవేరుస్తాం - సహదేవ్ గౌడ్:**

అనంతరం నూతన అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన ప్రతీ మాటను తప్పకుండా నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. తనను ఘనంగా సత్కరించిన ఉద్యమకారుల ఫోరం నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజయ్య, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, గౌరవ అధ్యక్షుడు కళ్లెం లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంధమల్ల బాలయ్య, ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు గంధమల్ల మల్లమ్మ, నాయకులు చిలుగూరి సత్తిరెడ్డి, బత్తిని రవీందర్ గౌడ్, మల్లం వెంకటేశం, బొడిగె సుదర్శన్ గౌడ్, కదిరేని స్వామి, కొండూరు సత్తయ్య గౌడ్, దండ మల్లికార్జున్, సుంకి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా మోటే రమేశ్

- రామన్నపేట మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి: జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

**తొలివెలుగు, రామన్నపేట:** మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉప సర్పంచుల ప్రత్యేక సర్వసభ్య సమావేశానికి మునుగోడు, భువనగిరి పరిసర ప్రాంతాల ప్రతినిధులతో పాటు, ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు సుర్కంటి శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఉప సర్పంచులందరి ఆమోదంతో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఫోరం రామన్నపేట మండల అధ్యక్షుడిగా మోటే రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సుర్కంటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచులతో పాటు సమానంగా ప్రజాసేవలో భాగస్వాములవుతున్న ఉప సర్పంచుల హక్కులను సాధించుకోవడానికి ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో ముందుకు సాగాలని తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా తీర్పాల ఐలయ్య, నల్ల జయసుధ, ప్రధాన కార్యదర్శిగా సంకబుడ్డి సైదులు యాదవ్ ఎంపికయ్యారు. అలాగే కార్యదర్శులుగా నీల నరసింహ, నడిగోటి పాండు, సహాయ కార్యదర్శులుగా చొప్పరి నరసింహ, సంజనబోయిన మహేశ్వరి, రవి, బైకాని ఉమా నియుక్తులయ్యారు. ప్రచార కార్యదర్శులుగా గుండాల రమేష్, నన్నూరి ఉపేందర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను తోటి ప్రజాప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.



# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

**తొలివెలుగు, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామానికి చెందిన దేశాపాక మల్లయ్య (వయస్సు వివరాలు తెలియరాలేదు) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య గత బుధవారం నార్కెట్‌పల్లికి వెళ్లి పని ముగించుకొని స్వగ్రామమైన కక్కిరేణికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని వంతెన సమీపానికి చేరుకోగానే ఎదురుగా ఓ సైకిల్ అడ్డంగా రావడంతో దానిని తప్పించబోయాడు. ఈ ప్రయత్నంలో అదుపు తప్పి ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ప్రమాదంలో ఆయన తలకు, పక్కటెముకలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం నార్కెట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం సుమారు 4.18 గంటలకు మల్లయ్య మృతి చెందినట్లు విధి నిర్వహణలో ఉన్న వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు దేశాపాక నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామన్నపేట ఎస్ఐ డి. నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.



# సుదర్శన్ సేవలు ఆదర్శప్రాయం

**తొలివెలుగు, రాజాపేట:** పార్టీ బలోపేతానికి అంకతి సుదర్శన్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, ఆయన ప్రతీ ఒక్కరికీ ఆదర్శప్రాయుడని బీఆర్ఎస్ రాజాపేట మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ కొనియాడారు. మండల కేంద్రమైన రాజాపేటలో శనివారం అంకతి సుదర్శన్ దశదిన దినకర్మ, సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పలువురు ప్రముఖులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ.. సుదర్శన్ మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పార్టీ అభివృద్ధి కోసం ఆయన అహర్నిశలు శ్రమించారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, రాజాపేట పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ సందిల వెంకటేష్, నర్సాపురం మాజీ సర్పంచ్ నాగిర్తి గోపి, ప్రముఖ నాయకులు ఎమ్మ భాస్కర్, దూది వెంకటాపురం బీఆర్ఎస్ నాయకులు దగ్గుల విష్ణుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల ముఖ్య నాయకులు, గ్రామస్థులు పాల్గొని సుదర్శన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలి
- చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్రంలో రాగల కొన్ని రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, అలాగే వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సూచించారు. శనివారం మధ్యాహ్నం చౌటుప్పల్ మున్సిపాలిటీ వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. హఠాత్తుగా వాతావరణం మారిపోయి వర్షం తీవ్రత ఎక్కువగా ఉండడంతో చైర్‌పర్సన్ స్పందిస్తూ పట్టణ ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు.

**నిరంతరం అందుబాటులో యంత్రాంగం:**

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని మాట్లాడుతూ.. అకాల వర్షాల కారణంగా మున్సిపల్ వ్యాప్తంగా పాత ఇళ్లు, విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎక్కడైనా వార్డుల్లో చెట్లు విరిగిపడినా లేదా కరెంట్ స్తంభాలు దెబ్బతిన్నా ప్రజలు ఎవరూ భయాందోళనలకు గురికావద్దని కోరారు. అలాంటి సంఘటనలు జరిగితే తక్షణమే స్థానిక వార్డు కౌన్సిలర్‌కు, మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి లేదా మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర సహాయం కోసం మున్సిపల్ యంత్రాంగం అంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు.



**అత్యవసరమైతేనే బయటకు రావాలి:**

మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, తప్పనిసరి పరిస్థితులు ఉంటే తప్ప వృద్ధులు, పిల్లలు ఇళ్ల నుంచి బయటకు రాకూడదని స్పష్టం చేశారు. విద్యుత్ లైన్లు తెగిపడే ప్రమాదం ఉన్నందున వీధుల గుండా వెళ్లేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు, మున్సిపల్ విపత్తు నిర్వహణ సిబ్బంది ప్రధాన కేంద్రాల్లోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఏ క్షణంలోనైనా తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆమె ఆదేశించారు.



## చేనేత మగ్గాల వద్ద ఫ్యాషన్ విద్యార్థుల సందడి

- కొయ్యలగూడెం ఇక్కత్ కళపై క్షేత్రస్థాయి అధ్యయనం
- ప్రకృతి రంగులు, డిజైన్ల రూపకల్పన చూసి మంత్రముగ్ధులైన విద్యార్థులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** చేనేత కళలకు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇక్కత్ వస్త్రాల తయారీకి ప్రసిద్ధి చెందిన చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెం గ్రామంలో శనివారం ఫ్యాషన్ డిజైన్ విద్యార్థులు సందడి చేశారు. 'అర్నిత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్' కళాశాలకు చెందిన విద్యార్థుల బృందం క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా గ్రామాన్ని సందర్శించి చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించింది. జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ చేనేత కళాకారుడు దుద్యాల శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు చేనేత రంగంపై అవగాహన పొందారు. ప్రకృతి సిద్ధమైన రంగులతో వస్త్రాలకు రంగులు అద్దే విధానం, మగ్గాలపై నూలు పోగులతో ఆకర్షణీయమైన డిజైన్లు రూపొందించే ప్రక్రియను ఆయన వివరంగా చూపించి తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా 'పోచంపల్లి ఇక్కత్' పేరుతో గుర్తింపు పొందిన టై అండ్ డై డిజైన్ల ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. గ్రాఫ్ పేపర్‌పై డిజైన్ల రూపకల్పన నుంచి వాటిని మగ్గాలపై ఆవిష్కరించే వరకు జరిగే ప్రతి దశను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. సంప్రదాయ నైపుణ్యం, ఆధునిక డిజైన్ భావనల సమన్వయంతో చేనేత వస్త్రాలు ఎలా రూపుదిద్దుకుంటాయో తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు స్థానిక చేనేత కార్మికులతో ముఖాముఖి సమావేశమయ్యారు. తరతరాలుగా కొనసాగుతున్న చేనేత కళను భావితరాలకు అందిస్తూ పరిరక్షించాల్సిన అవసరాన్ని కళాకారులు వివరించారు. ఆధునిక ఫ్యాషన్ ప్రపంచంలో చేనేత వస్త్రాలకు కొత్త రూపాలు, హంగులు అద్దుతూ ప్రపంచ మార్కెట్‌లో మరింత గుర్తింపు తీసుకురావడంలో ఫ్యాషన్ డిజైన్ విద్యార్థుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ పర్యటన ద్వారా చేనేత కళలోని సృజనాత్మకత, శ్రమ, సాంస్కృతిక విలువలను దగ్గరగా తెలుసుకునే అవకాశం లభించిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నూతన అధ్యక్షులు

- కృతజ్ఞతలు తెలిపిన బోయ దేవేందర్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వెల్లడి



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండల, మున్సిపల్ కాంగ్రెస్ కమిటీల నూతన అధ్యక్షులు శనివారం మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన చౌటుప్పల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. తమ నియామకానికి సహకరించినందుకు గాను రాజగోపాల్ రెడ్డికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

**కంకణబద్ధులై పనిచేస్తాం:**

ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బోయ దేవేందర్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ.. తమపై నమ్మకముంచి పార్టీ పదవులను అప్పగించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు, అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తామని స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు లోబడి, శ్రేణులను ఏకతాటిపైకి తెస్తూ రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కంకణబద్ధులై పనిచేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని పలువురు ముఖ్య కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా పైలెట్‌ను వేధిస్తున్న ఫిట్‌నెస్ మేనేజర్ అరెస్ట్

అమీర్‌పేట్, జూన్ 13 :మహిళా పైలెట్‌ను లైంగికంగా వేధించిన కేసులో ఓ జిమ్ ఫిట్‌నెస్ మేనేజర్‌ను సనత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పైలెట్‌గా పని చేస్తున్న నగరానికి చెందిన ఓ మహిళ (37) మార్చి నుండి ఎర్రగడ్డలోని కల్ట్ జిమ్‌లో వ్యాయామ శిక్షణ తీసుకుంటోంది. ఇదే జిమ్‌లో ఫిట్‌నెస్ మేనేజర్‌గా ఉన్న సంతోష్ గౌడ్ సదరు మహిళపై కన్నేసి కొద్ది రోజులుగా అసభ్యకర చేష్టలతో ఇబ్బందులు పెడుతున్నాడు. అంతటితో ఆగకుండా ఇన్‌స్టాలో ఫాలో అవుతూ, అసభ్యకర పోస్టింగ్ చేస్తున్నాడు. జిమ్‌లో తన గర్ల్ ఫ్రెండ్‌తో ఆ మహిళకు రాత్రివేళ ప్రత్యేక శిక్షణనిస్తానంటూ రాయబారం పంపుతూ వత్తిడికి గురి చేశాడు. పలుమార్లు సంతోష్‌గౌడ్ గర్ల్‌ఫ్రెండ్ బాధిత మహిళతో.. ఇద్దరం కలిసి ఒకేసారి సంతోష్‌గౌడ్‌తో కలుద్దామంటూ వత్తిడి చేసేదని తెలుస్తోంది.

## భీమలింగం కాల్వలో గుర్రపుడెక్కను తొలగించాలి

- సాగునీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీపీఎం నాయకులు



**తొలివెలుగు, వలిగొండ:** మండల పరిధిలోని భీమలింగం కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకును, చెత్తాచెదారాన్ని అధికారులు వెంటనే స్పందించి తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం వలిగొండ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో నాయకులు కాల్వ ప్రవహించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వలిగొండ నుండి తుర్కపల్లి మీదుగా పాలడుగు వరకు ప్రవహించే భీమలింగం కాల్వ అంతా గుర్రపుడెక్క మొక్కలతో నిండిపోయి, నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం కలిగిస్తున్న దుస్థితిని వారు తెలిపారు.

**నిలిచిపోతున్న సాగునీరు**

ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్, మెరుగు వెంకటేశం మాట్లాడుతూ.. కాల్వ పొడవునా గుర్రపుడెక్క ఆకు దట్టంగా పేరుకుపోవడం వల్ల సాగునీరు ముందుకు సాగకుండా నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఆయా గ్రామాల రైతులకు సకాలంలో నీరందక పంటలు ఎండిపోయి, తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే స్పందించి గుర్రపు డెక్క ఆకును తొలగించాలని డిమాండ్ చేశారు.

**విష జ్వరాలు ప్రబలే ప్రమాదం**

మరోవైపున వలిగొండ పట్టణ పరిధిలో ఈ గుర్రపు డెక్క ఆకు కారణంగా నీరు నిల్వ ఉండి కలుషితమవుతోందని, దీనివల్ల దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాకాల సీజన్ ప్రారంభం కావడంతో ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక మున్సిపల్ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన స్పందించి జెసిబి యంత్రాల ద్వారా కాల్వను శుభ్రం చేయించాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు దుబ్బ లింగం, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, మండల, పట్టణ నాయకులు కొండూరు సత్తయ్య, రాధారపు మల్లేశం, శీలం ఇందిర, వేముల లక్ష్మయ్య, ద్యానబోయిన యాదగిరి, అలకుంట్ల నరసింహ, బొడ్డు శంకర్ తదితరులు పాల్గొన్నారు.





## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

- సింగన్నగూడెం కాలనీని పరిశీలించిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్
- గడువులోగా మౌలిక వసతులు కల్పించాలని ఆదేశం

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** భువనగిరి మండల పరిధిలోని సింగన్నగూడెం గ్రామ శివారులో నిర్మించిన ద్విబెడ్‌రూమ్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. శనివారం వారు కాలనీలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ, మౌలిక వసతుల పనులను క్షేత్రస్థాయిలో ఉమ్మడిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్లు కాలనీ అంతటా పర్యటించి లబ్ధిదారులకు కల్పించాల్సిన కనీస అవసరాలపై సమీక్షించారు. ముఖ్యంగా కాలనీలో తాగునీటి సరఫరా లైన్లు, అంతర్గత సిమెంట్ రహదారులు (సీసీ రోడ్లు), విద్యుద్దీకరణ, డ్రైనేజీ వ్యవస్థ తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిలిచిపోయిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా కసరత్తు చేయాలని సూచించారు. లబ్ధిదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అన్ని మౌలిక సదుపాయాలు యుద్ధప్రాతిపదికన అందుబాటులోకి వచ్చేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరిగినా సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోత్నక్ శ్రీవాణి రవికుమార్, మున్సిపల్, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖల ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కార్యకర్తలను ఏకతాటిపైకి తెచ్చి పార్టీని బలోపేతం చేయాలి
- పోచంపల్లి నూతన పట్టణ అధ్యక్షుడికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి దిశానిర్దేశం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ చేర్చేలా నూతనంగా ఎన్నికైన పట్టణ, మండల అధ్యక్షులు బాధ్యతాయుతంగా పనిచేయాలని భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. భూదాన్ పోచంపల్లి కాంగ్రెస్ నూతన పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన లవకుమార్ శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లవకుమార్‌కు ఎమ్మెల్యే నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తనకు రెండోసారి పట్టణ అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు లవకుమార్ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పార్టీ నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు.

**పార్టీ బలోపేతంలో అధ్యక్షులదే కీలక పాత్ర:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో పట్టణ, మండల అధ్యక్షుల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. కార్యకర్తలందరినీ ఏకతాటిపైకి నడిపిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ప్రజా ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నాయని, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత శ్రేణులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు మర్రి నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, నాయకులు దారెడ్డి వేణుగోపాల్ రెడ్డి, గోరంటి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కాసుల అంజయ్య పాల్గొన్నారు.

## పేదలకు వరం 'సీఎం సహాయ నిధి'

- ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో చెక్కుల పంపిణీ
- లబ్ధిదారులకు అందజేసిన కాంగ్రెస్ శ్రేణులు

**తొలివెలుగు, రామన్నపేట:** ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను శనివారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులు కలిసి ఈ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక మంచి వరం లాంటిదని కొనియాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరంతరం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజల మన్ననలను పొందుతోందని నాయకులు స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవ చూపిస్తూ, త్వరగా చెక్కులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ఆపదలో ఉన్న పేదలకు ఈ నిధి ఎంతో ఊరటనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కే.ఎం. జాన్, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్, కాంగ్రెస్ నాయకులు జెల్లా వెంకటేష్, గొరిగే శేఖర్, వినాయతుల్లా బిగ్, మన్సూర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

